రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



## అభివృద్ధి పనుల నాణ్యతపై మున్సిపాలిటీ పాలకుల ఆగ్రహం



ఇంటిగ్రేటెడ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపాలిటీ పాలకవర్గం సభ్యులు

**ఆమనగల్లు, ఏప్రిల్10, ప్రభాతవార్త:**

ఆమనగల్లు మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలు పాటించడంలేదని మున్సిపాలిటీ పాలకవర్గం ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులలో నాణ్యతను పాటిస్తేనే అవి దీర్ఘకాలికంగా ప్రజలకు సేవలందిస్తాయని వారు అన్నారు. మున్సిపాలిటీ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, కౌన్సిలర్‌లు చెక్కాల లక్ష్మణ్, తల్లోజు విజయ్‌కృష్ణ, కృష్ణనాయక్, దుడ్డు కృష్ణయాదవ్, సుజాతరాములు, కోఆప్షన్‌మెంబర్ మేడిశెట్టి శ్రీధర్‌ల బృందం సోమవారం ఇంటిగ్రేటెడ్ నిర్మాణ పనులను సందర్శించి నాణ్యతపై ఆవేదన వ్యక్తం చేశారు. 4.5కోట్ల నిధులతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గుత్తేదారు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. స్వల్పకాలంలోనే నిర్మాణాలు బీటలు ఏర్పడుతున్నాయని, ఏమాత్రం పట్టు లేకుండా బలంగా లాగితే పెచ్చులు రాలడం మన్నికపై అనుమానాలు లేవనెత్తుతున్నాయని చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ బీమనపల్లి దుర్గయ్యలు మండిపడ్డారు. కోట్లు వెచ్చించి నిర్మిస్తున్న ప్రభుత్వ అభివృద్ధి పనులు మన్నిక లేమితో ప్రజాధనం లూటీ అవుతుందన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో గుత్తేదారుడు ఇష్టారాజ్యంగా నాసిరకం మెటీరియల్ వినియోగిస్తూ పనులు జరుగుతున్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మన్నిక లేకుండా ప్రభుత్వ నిర్మాణాలు చేపడితే చూస్తూ ఉపేక్షించేది లేదని వారు హెచ్చరించారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం మెటీరియల్ వాడి నాణ్యతగా అభివృద్ధి పనులు చేపట్టాలని వారు సూచించారు.

## మండలంలో శిక్షణ పొందుతున్న ఐపిఎస్ అధికారుల పర్యటన



పోలీస్ స్టేషన్‌ను సందర్శిస్తున్న దృశ్యం

**కడ్తాల్,ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** హైదరాబాద్‌లోని జాతీయ అకామిలో శిక్షణ పొందుతున్న ఐపిఎస్ అధికారులు బృందం సోమవారం కడ్తాల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి కేసుల నమోదు క్రైమ్ రేటు విచారణ ఎఫ్ఐఆర్ నమోదు తదితరాంశాలపై పోలీస్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ హరి శంకర్‌గౌడ్ అడిగి తెలుసుకున్నారు.అనంతరం కడ్తాల్ మండల పరిధిలోని సోలార్‌పూర్, మైసిగండి, గ్రామాలలో పర్యటించి పోలీస్ వ్యవస్థ శాంతిభద్రతలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ నిర్వహణలో భాగంగా హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు, ఆస్తి వివాదాలు, హత్యాయత్నం తదితర కేసులో పంచనామా గురించి రౌడీషీట్ల వివరాలు నమోదు గురించి సిసి కెమెరాలు వినియోగం నేర పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం గురించి వారికి ఎస్సై హరిశంకర్‌గౌడ్ వివరించారు.

## నందివనపర్తిలో చిరుధాన్యాలపై అవగాహన

**యాచారం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త**

అంతర్జాతీయ తృణ ధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలు, మహిళలకు చిరుధాన్యాల ప్రాధాన్యత, ఆవశ్యకత గురించి డిప్లొమాన్ ఇన్ అగ్రికల్చర్ విద్యార్థిని పోలోజు పూర్ణిమ, ఏఈవో సందీప్‌లు వివరించారు. అనంతరం ఫెర్టిలైజర్ డ్రాపర్ మందులను కావాల్సినంత పరిమాణం వరకు పంటకు అందించే విధంగా కొత్త పరికరాన్ని పూర్తిమ కనిపెట్టిన పరికరాన్ని గ్రామస్తులకు ఈ సందర్భంగా పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జోగిరెడ్డి, టిఆర్ఎస్ అధ్యక్షుడు పంది సుధాకర్, కొండాపురం ధానయ్య, ముచ్చర్ల వెంకటేష్. భీనమోని వెంకటయ్య, కొండాపురం యాదయ్య, ముచ్చర్ల రమేష్, సుక్కపురం ఆంజనేయులు, ఇరుపాక రంగారెడ్డి, కట్టకింది రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణీ



దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణ రెడ్డి



ప్రజావాణిలో ఫీర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ తిరుపతి రావు



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి,పాల్గొన్న తదితరులు

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ప్రజావాణి కార్యక్రమంలో బాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు.సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చేసిన ప్రజల నుండి వారి సమస్యలపై 266 ఫిర్యాదులను కలెక్టర్ స్వీకరించారు.ఉదయం 10 : 30గంటల నుండి మధ్యాహ్నం 3 : 30 గంటల వరకు స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేసి వచ్చిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని పెండింగ్‌లో ఉంచరాదని అన్నారు.

**మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో మహాత్మజ్యోతి బాపూలే 197వ జయంతి ఉత్సవాలు**

అంతకుముందు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ....ఈ నెల 11న కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 11 :30 గంటలకు మహాత్మ జ్యోతి బా పూలే 197వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అధికారులందరూ విధిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ,అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌లతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**రంగారెడ్డి కలెక్టర్‌రేట్‌లో ....**

**చేవెళ్ల ఏప్రిల్ 10,ప్రభాతవార్త :** ప్రజావాణిలో స్వీకరించిన సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ తిరుపతి రావు అదికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో రెవెన్యూ అధికారి హరిప్రియతో కలిసి వివిధ ప్రాంతాల నుండి ప్రజల నుండి సమస్యలను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ తిరుపతి రావు మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబందిత అదికారులకు సూచించారు. స్వీకరించిన అర్జిలను నిర్లక్ష్య చేయకుండా పరిశిలించి సమస్యలను పరిష్కరించాలన్నారు.సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసకుంటామన్నారు. ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు 120 పిర్యాదులు చేశారు.

**మేడ్చల్ కలెక్టరేట్‌లో ....**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ప్రజల నుంచి 89ధరఖాస్తులు అందినట్లు, ప్రజావాణిలో వచ్చిన వాటిని జిల్లా సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ నర్సింహ్మారెడ్డి ఆదేశించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు సమస్యలపై, ఫిర్యాదులు, ధరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగ జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ పెండింగ్‌లో ఉన్న ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన వాటికి అత్యంత ప్రాదాన్యత ఇచ్చి సమస్యలు పరిష్కరించి సంబంధిత వెబ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. తమ పరిధిలో లేని వాటిపై ఫిర్యాదుదారులకు తగు మార్గనిర్దేశం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ లింగ్యా నాయక్, జిల్లా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాధితులను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదు

**-వారికి కేటాయించిన స్థలంలో యథేచ్ఛగా నిర్మాణాలు చేసుకోవచ్చు**

**-కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి**

**మేడ్చల్, ఏప్రిల్ 10. ప్రభాతవార్త :**

మేడ్చల్‌లో రోడ్డు వెడల్పులో ఇండ్లు కోల్పోయిన బాదితులందరు. వారికి కేటాయించిన స్థలంలో ఇండ్లు నిర్మించుకునేందుకు అధికారులు ఎలాంటి అడ్డు చెప్పరాదని కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి స్పష్టం చేశాడు. మేడ్చల్ మండలంలోని వివిధ గ్రామాల్లో 58, 59 జీవో కింది ధరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సోమవారం మంత్రి మండల పరిషత్ కార్యాలయంలో పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ పట్టణంలో గతంలో చేపట్టిన రోడ్డు వెడల్పులో ఎంతో మంది నిరులపేదలు ఇండ్లు కోల్పోయి ఇబ్బందులు పడుతూ, వారికి కేటాయించిన స్థలంలో ఇండ్లు నిర్మించుకుంటుంటే అధికారులు అడ్డుకుంటున్నారని మేడ్చల్ మున్సిపల్ చైర్మన్ దీపిక నర్సింహారెడ్డి ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకోచ్చారు, అందుకు స్పందించిన మంత్రి ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డు వెడల్పులో ఇండ్లు కోల్పోయిన పేదలకు పట్టాలు ఇచ్చి సంవత్సరాలు గడుస్తుండగా, వారికి కేటాయించిన స్థలంలో ఇండ్లు నిర్మించుకుంటే అదికారుల అభ్యంతరమేమిటని, ఈ విషయంలో అడ్డు చెబితే చర్యలు తీసుకుంటామని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ రాములును హెచ్చరించాడు, ఈ విషయమై ఉన్నతాధికారులతో ఇప్పటికే మాట్లాడనని. ఇండ్లు కోల్పోయిన బాదితులు వారికి కేటాయించి పట్టాలు ఇచ్చిన స్థలంలో నిర్మాణాలు చేపడితే ఎవరు అడ్డుకోరాదని తెలిపారు. ప్రభుత్వ స్థలంలో పేదలు కట్టుకున్న ఇండ్లకు బరోసా కల్పించాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ 58, 59 జీవో ప్రవేశపెట్టి పట్టా సర్టిఫికెట్‌లు అందజేస్తూ వారిని స్వంత ఇంటి యజమానులుగా మార్చారని అన్నారు. అందులో భాగంగా మేడ్చల్ మండలంలో ఇప్పటికే ఇండ్లు నిర్మించుకున్న 134 మందికి ఈ జీవో కింద ఇండ్ల పట్టాలు అందజేశామన్నారు. ఇంకా మిగిలి నవారేవన ఉంటే వారికి కూడ ఈ సదుపాయం కల్పిస్తామన్నారు. గ్రామాలల్లో ఇండ్లు లేని పేదవారికి స్వంత స్థలం ఉంటే, వారికి రూ. 3 లక్షలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. స్వంత స్థలం ఉన్నవారిని వెంటనే స్థానిక సర్పంచ్‌లు, ఎంపిటీసీలు, మున్సిపల్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు గుర్తించాలని, ఎంత మంది ఉన్న వారికి ఇచ్చే విదంగా తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రజిత రాజమల్లారెడ్డి, జడ్పిటిసి శైలజా విజయనందరెడ్డి, మేడ్చల్ మున్సిపల్ చైర్మన్ దీపిక నర్సింహారెడ్డి,జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నందారెడ్డి, వైస్ ఎంపిపి వెంకటేష్, సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయనందరెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ భాస్కర్ యాదవ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు గీత భాగ్యరెడ్డి, నర్మదా గోపాల్‌రెడ్డి, బాబు యాదవ్, ఉప సర్పంచ్ శివలక్ష్మి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, మున్సిపల్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, నాయకుడు రాజమల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్‌లో పట్టాలు పంపిణీ చేస్తున్న కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి

## సమ్మె బాట పట్టిన ఐకేపీ వీవోఏలు

**-జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించిన వీవోఏలు**



కలెక్టర్ నారాయణరెడ్డి వినతిపత్రం ఇస్తున్న వీఓఏలు

**వికారాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:**

జిల్లా మహిళా సంఘాలలో పనిచేస్తున్న 645 మంది ఐకేపీ వీవోఏ లు సమ్మె బాట పట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ, సోమవారం జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐకేపీ వీవోఏ ల సంఘం నాయకులు మాట్లాడుతూ, కనీసం రోజు కూలి పనులు చేసే వాళ్ళ కన్నా అద్వానంగా మా పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు, ప్రస్తుతం ఇస్తున్న రూ. 3,900లు పెరిగిన నిత్యావసరాల ధరలకు కారణంగా ఏమి సరిపోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వేతన కార్మిక చట్టం ప్రకారం కనీసం రూ.18000 ఇవ్వాలని కలెక్టర్ కు ఇచ్చిన వినపత్రంలో వివరించడం జరిగిందని గుర్తు చేశారు. వీవోఏలు సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం 18000 ఇవ్వాలని, రూ.50 లేదా లక్ష భీమా వసతి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేతనాలు వ్యక్తి గత ఖాతాలో జమ చెయ్యాలని, పని భారం తగ్గించి, డ్రెస్ కోడ్ అమలు చెయ్యాలని ప్రభుత్వాన్ని కోరారు.పై అధికారుల ఒత్తిడి తగ్గించి, 58 జీవో సవరించాలని తెలిపారు. శ్రీనిధి ండి రూ.5 వేలు వేతనం ఇవ్వాలని, సీనియర్ వీవోఏలు సీసీ లుగా ప్రమోట్ చెయ్యాలని, తొలగించిన వీవోఏ లు తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. డిమాండ్ లు నెరవేరె వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు సుజాత, ఉపాధ్యక్షులు ఫయోనీ బేగం, ప్రధాన కార్యదర్శి సాయప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు కావలి నర్సిములు, సలహాదారులు గోవర్ధన్, గోపాల్‌గౌడ్, ఆయా మండలాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కెసిఆర్ పెద్దపీట : ఎమ్మెల్యే

**మొయినాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసిఆర్ పెద్దపీఠ వేస్తున్నారని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మొయినాబాద్ మండలంలోని పెద్దమంగళారం గ్రామంలో సర్పంచ్ కోట్ల నరోత్తం రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని సిసి రోడ్డు అభివృద్ధి పనులను ప్రారంభోత్సవ కార్యాక్రమం నిర్వహించారు, ఈ కార్యాక్రమానికి ముఖ్య అతిధిలుగా చేవెళ్ల ఎమ్మెలే కాలే యాదయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని ప్రజా అభివృద్ధి కార్యాక్రమాలు సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసిఆర్ తీసుకోచ్చారని, ప్రత్యేకంగా గ్రామాల్లో అభివృద్ధి కి పెద్దపీఠ వేసారన్నారు, అనంతరం ఆయన చేతులమీదుగా 30 లక్షల నిధుల ఎచ్.ఎం.డి.ఎ, ఎస్‌డిఎఫ్, ఎన్‌డిఎఫ్, ఎం.జి.ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ నుండి సిసిరోడ్డు పనులకు శంకుస్ధాపని చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నరోత్తం రెడ్డి మాట్లాడుతూ పెద్దమంగళారం గ్రామ అభివృద్ధి ముందు వరుసలో ఉందన్నారు. ఎప్పుటికప్పుడు గ్రామ అభివృద్ధి పట్ల, గ్రామ క్షేమం పట్ల, గ్రామ పంచాయితి పాలకవర్గం తో పాటు గ్రామస్దులు పాలిభాగస్తులు అవుతున్నారని ఈ కార్యాక్రమానికి పునాదివేసి గ్రామ అభివృద్ధికి అన్ని విషయాల్లో తోడుగా ఉంటు, శంకుస్దాపనకు వచ్చిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు, ఈ కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం జేవంత్, మాజి ప్రజా ప్రతినిధులు కోంపల్లి అనంతరెడ్డి, ఎంపీటీసి, పార్ట్ 1 పాటటి సుమలత, ఎంపీటిసి పార్ట్,2 శ్రీనివాస్, ఉప్పసర్పంచ్, రజిత, ఎంపీడివో సంధ్య, సిఆర్ డి.ఈ విజయ్ కుమార్, ఎఈ గోపాల్, ఎంపీవో వెంకటేశ్వర్ రెడ్డి, గ్రామ పంచాయితి, వార్డు మెంబర్లు, కార్యదర్శి తధితరులు పాల్గోన్నారు.



## వ్యభిచార గృహంపై పోలీసులు, ఎస్వోటీ దాడులు

**- కేసు వివరాలు వెల్లడించిన సీఐ నవీన్‌కుమార్**

**- షాద్‌నగర్ పట్టణంలోని శ్రీనివాస కాలనీలో చోటు చేసుకున్న ఘటన**

**షాద్‌నగర్, ఏప్రిల్ 10, (ప్రభాతవార్త) :**

పట్టణంలోని శ్రీనివాస కాలనీలో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న షాద్‌నగర్ పోలీసులు, శంషాబాద్ ఏస్వోటీ పోసులు ఆదివారం సాయంత్రం ఎంతో చాకచక్యంగా వ్యవహరించి ఇంటిపై దాడులు చేసి నిందితులను పట్టుకున్నరు. కేసు వివరాలు స్థానిక సీఐ నవిన్ కుమార్ సోమవారం సాయంత్రం మీడియాకు విడుదల చేశారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం... వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారం రావడంతో ఆ ఇంటిపై పోలీసులు దాడి చేశారు. దాడిలో 5 మంది నిందితులను పట్టుకొని, వారి నుంచి బాదితురాలిని కాపాడి నిందితులను అరెస్టు చేసి జూడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. నిందితులైన ముడావత్ తార (40) శ్రీనివాస్ కాలనీ, షాద్‌నగర్, స్వగ్రామం ఇంద్రకల్ తాండ, నాగర్‌కర్నూల్ జిల్లా, కమ్మరి వెంకటేష్ (కమ్మదనం), ఎం.డి. సలీం (కిషన్‌నగర్), బాష, అసనుల్లాఖాన్ ఫరూఖ్‌నగర్, శీలం సాయికుమార్ ప్రైవేటు సూపర్‌వైజర్, గుండుగేరికి చెందిన వారి దగ్గరి నుంచి రూ.12500, 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. నమ్మదగిన సమాచారంపై ఇద్దరు పంచులను తీసుకొని అక్కడికి వెళ్ళి, ఇంటి లోపలికి వెళ్లి చూడగా ఒక హాల్‌లో ముగ్గురు మగ వ్యక్తులు ఉన్నారు. వారి పేర్లు తెలుసుకోగా వెంకటేష్, సాయికుమార్, సలీం, ఒక ఆడ వ్యక్తి మూడవత్ తార అని చెప్పారు. ఇంట్లోని ఒక గదిలోకి వెళ్లి చూడగ అందులో ఒక బెడ్ పై ఒక మహిళ (బాదితురాలు), ఒక వ్యక్తి నసురుల్లా ఖాన్‌లు ఉన్నారు. వెంటనే పోలీసులు అందదరినీ అదుపులోకి తీసుకొని విచారించగా వీరిలో ముడావత్ తార, వెంకటేష్‌లు కలిసి గత కొంత కాలం నుంచి శ్రీనివాస కాలనీలో పోర్షన్ అద్దెకు తీసుకొని వ్యభిచారం చేయిస్తున్నారు. వీరికి కర్నూల్‌కు చెందిన బాష అనే వ్యక్తి ద్వారా అమ్మాయిలను పంపిస్తుంటారనని ఇలా అమ్మాయిలను ఒక వ్యక్తితో గడిపితే 1000 ఇస్తామని ఒప్పందం చేసుకొని, ఈ వ్యబిచార గృహాని నడుపుతున్నారు. ఆ మాదిరిగానే ఒక అమ్మాయిని గత నాలుగు రోజుల కిందట బాష పంపగా వీరికి సహాయకుడిగా సలీం అనే ఒక వ్యక్తిని ఆటో డ్రైవర్‌ను పెట్టుకొని వారి వద్దకి వచ్చే కస్టమర్లతో డబ్బులు మాట్లాడుతూంటారు. ఇద్దరు వ్యక్తులు హసనుల్లా ఖాన్, సాయి కుమార్ అనే కస్టమర్లను వెంకటేష్ ద్వారా పిలిపించి, వారిని సలీం ఆటో డ్రైవర్ తీసుకు రాగా వారితో మాట్లాడి ఒక్కొక్కరికి రూ.1500గా ఒప్పందం చేసుకొని డబ్బులను తీసుకొని బిజిలి అనే అమ్మాయి వద్దకి హసనుల్లాఖాన్ అనే కస్టమర్ మొదటగా పంపారు. అదే సమయంలో పోలీసులు సాయంత్రం అక్కడికి పంచులతో వెళ్లి రైడ్ చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి బాదితురాలిని కాపాడి నిందితులను జూడీషియల్ రిమాండ్ తరలించారు.



పట్టుబడిన నిందితులు

## భూదాన్ భూములను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**-ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి**

**-వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్ డిమాండ్**

**-మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద బికెఎంయు,సిపిఐ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ధర్నా**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

జిల్లా పరిధిలోని కీసరలోని భూదాన్ భూములను ఆక్రమిస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని, ఆ భూముల్లో పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ముందు జిల్లాలోని కీసరలో ఉన్న భూదాన్ భూములు ఆక్రమణలకు గురికాకుండ చూడాలని,కబ్జాలను ఆపాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తోటపల్లి శంకర్ ఆధ్వర్యంలో సిపిఐ నాయకులు, బికెఎంయు నాయకులు, కార్మికులు పలువురు పాల్గొని ధర్నా చేశారు. ఈ సందర్భంగ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్ మాట్లాడుతూ భూదాన్ భూముల్లో పేదలు ఇళ్ల కోసం గుడిసెలు వేసుకుంటే పోలీసులు, రెవెన్యూ అధికారులు హుటా హుటిన వచ్చి గుడిసెలను తొలగించి, భూకబ్జాదారులు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం భూదాన భూములను ఈ భూకబ్జాదారుల నుంచి రక్షించకుంటే పెద్ద ఎత్తున సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం ప్రజలను సమీకరించి భూధాన భూములను ఆక్రమిస్తామని ఆయన హెచ్చరించారు. ఆ భూములు భూకామాంధుల పరం కాకుండ ప్రభుత్వం జోక్యం చేసుకుని తక్షణమే వాటిని పేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించి పట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగ ఉండటానికి గూడు లేని పేదలు ప్రజలు ఎంతో మంది ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లస్థలాలు, డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వకపోవటం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు సంవత్సరానికి 200రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. కూలీలకు రోజుకు 600రూపాయలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంటి స్థలం ఉండి ఆర్థిక స్థోమత లేని వారు ఇళ్లు నిర్మించుకోటానికి ప్రభుత్వం 6లక్షల రూపాయలు ఇవ్వాలని బాలమల్లేశ్ డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా కార్మిక సంఘం కార్యదర్శి తోటపల్లి శంకర్, జిల్లా కార్యవర్గసభ్యులు రచ్చ కిషన్, మహాలక్ష్మి, స్వరూప, ఐలయ్య, యాదయ్యగౌడ్, సల్మాన్‌భేగ్, యాదగిరి, ఎం.రాజేశ్వరి, లక్ష్మణ్, రవినాయక్, రాజేశ్, మహేశ్, ఇమ్రాన్, సుగుణ, తదితరులు పాల్గొన్నారు. ఆ తరువాత జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డికి నాయకులు కలెక్టర్‌కు వెళ్లి వినతిపత్రాన్ని అందజేశారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ముందు కీసరలోని భూదాన్‌భూములను కబ్జా చేయకుండ చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు, బికెఎంయు నాయకులు, కార్మికుల దృశ్యం

## కలెక్టరేట్ ముందు పెన్షనర్ల ధర్నా

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10,ప్రభాతవార్త**

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలంటూ పెన్షనర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ముందు తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ అసోసిషియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు పి.విజయకుమార్, ఎల్.మాణిక్‌రెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. జిల్లా కలెక్టరేట్ ముందు వారు నిరసన ధర్నా చేశారు. ఈ సందర్భంగ జిల్లా అధ్యక్షులు విజయకుమార్ పేర్కొంటూ ప్రభుత్వం మాకు ప్రతి నెలా 1వ తేదీన ఇవ్వకుండా 15వ తేదీ వరకు జరుపుతున్నారని, ఇలా అయితే మా జీవితం ఎలా గడుస్తుందన్నారు. డిఎ, పిఆర్‌సి బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. పెన్షనర్లందరికి హాస్పిటల్స్‌లో నగదు రహిత వైద్య సేవలు అందించాలని, ఈ-కుభేర వ్యవస్థను రద్దు చేయాలని కోరారు. దీనిలో అసోసిషియేషన్ కార్యవర్గసభ్యులు ఎం.అంజిరెడ్డి, జి.మల్లారెడ్డి, ఎం.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## అద్రాస్‌పల్లిలో సిఎంరిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



అద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన బాధితునికి సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు మంజూరు కావటంతో మంత్రి మల్లారెడ్డి చెక్కును అందజేసిన దృశ్యం

**శామీర్‌పేట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

అద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన జీడి సతీష్‌కు సిఎం రిలీఫ్‌ఫండ్ ఆర్థిక సహాయం 45వేల రూపాయలు మంజూరు కావటంతో చెక్కును ఆయనకు రాష్ట్ర మంత్రి సిహెచ్ మల్లారెడ్డి అందజేశారు. సోమవారం మూడుచింతలపల్లి మండలంలోని అద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన జీడి సతీష్‌కు ఆరోగ్య సేవలు పొందటానికి ప్రభుత్వం నుంచి సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును మంత్రి అందజేశారు. ఆపదలో ఉన్న వారిని ప్రభుత్వం ఆదుకుంటుందని, ఆర్థికంగ చేయూత నందించటానికి ప్రభుత్వం సిఎం రిలీఫ్‌ఫండ్‌ను అందజేస్తుందన్నారు. మంత్రి మల్లారెడ్డి సహకారంతో సిఎం రిలీఫ్‌ఫండ్ మంజూరు అయినట్లు గ్రామ నాయకులు బోయిన నర్సింహ్మా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షులు గ్యార భూపాల్, తదితరులు పాల్గొన్నారు.

## మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన వాహనాలు

**-సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వాహనదారులకు సూచన**

**చేవెళ్ల, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

సైబరాబాద్ కమిషరేట్ పరిధిలో వివిధ కేసులల్లో సీజ్ చేసిన వాహనాలను మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో వాహనాలను భద్రపరిచామని, వాహనదారులు తమ వాహనాలను చూసుకోవాలని సైబరాబాద్ కమీనర్ స్టీఫేన్ రవీంద్ర సూచించారు. వివిధ కేసులల్లో సీజ్ చేసిన 885 వాహనాలను వాహనదారులు తీసుకోలేదని, సీజ్ చేసిన వాహనాలను లో పోందుపరిచామని తెలిపారు. తమ వాహనాలను చెక్ చేసుకుని ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లైతే వాహనదారులు సంబందిత పోలీస్ స్టేషన్‌లో వాహనంకు సంబందించిన ద్రవపత్రాలను 6 నెలలలోపు సమర్పించి తీసుకోవాలని, లేని పక్శంలో అట్టి వాహనాలను వేలం వేయడం జరుగుతుందని, మరిన్ని వివరాల కోరకు ఎంటిఓ ఎన్. విష్ణు పోన్ నంబర్ 9490517317ను సంప్రదించాలని సైబరాబాద్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర సూచించారు.

## బాధిత కుటుంబానికి కెఎస్ఆర్ భరోసా



కుటుంబానికి సహాయం అందిస్తున్న శరత్‌కుమార్‌రెడ్డి.

**దోమ.ఏప్రిల్ 10 ప్రభాతవార్త :**

కుటుంబ సభ్యుల్లోని వ్యక్తి అనారోగ్యం చెందడంతో కుటుంబాన్ని ఆదుకునేందుకు తన వంతు ఆర్థిక సహాయం అందించేందుకు కెఎస్ఆర్ ట్రస్టు చైర్మెన్ శరత్‌కుమార్‌రెడ్డి ముందుకు వచ్చారు.దోమమండల పరిదిలోని బాస్పల్లి గ్రామానికి చెందిన పద్మారాం రాములమ్మ గత కొన్నాళ్ళుగా కాలుకు గాయం అయి దుర్వాసనతో బాదపడుతుంది.ఈ విషయం తెలుసుకున్న ట్రస్టు చైర్మెన్ శరత్‌కుమార్‌రెడ్డి సోమవారం నాడు బాదితురాలిని పరమర్శించారు.మానవ దృక్పథంతో ఆలోచించి బాదితురాలి ఆరోగ్యపరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.తక్షణమేబోంపల్లి గ్రామము నుండి డాక్టర్‌ను పిలిపించి రాములమ్మ కాలుకు డ్రెస్సింగ్ చేయించారు.త్వరగా కాలు బాగు చేయించుకోవాలని వైద్య ఖర్చుల కోసం బాదితురాలు రాములమ్మకు 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.మండల పరిదిలోని ఖమ్మం నాచారం గ్రామానికి చెందిన రిటైర్డ్ పట్వారి చంద్రశేఖర్ మృతి చెందడంతో సోమవారం నాడు దశదినకర్మకు హజరై కుటుంబసభ్యులను పరమార్శించారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘాల అధ్యక్షులు బాస్కర్, బోంపల్లి నర్సిములు,మండల బిజెవైయం అధ్యక్షులు మేకల నర్సిములు, తదితరులు పాల్గొన్నారు.

## శివారెడ్డిగూడలో పేదలకు దుస్తుల పంపిణీ



శివారెడ్డిగూడలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న సుగుణ రాంరెడ్డి

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మున్సిపల్ శివారెడ్డిగూడలో సోమవారం నిరుపేదలకు కొంతం కుటుంబసభ్యులు దుస్తులు పంపిణీ చేశారు. స్వర్గీయ కొంతం బాల్‌రెడ్డి 3వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు, మాజీవార్డుసభ్యులు కొంతం రాంరెడ్డి–సుగుణ దంపతులు పేదలకు వితరణ చేశారు. శివారెడ్డిగూడలోని శ్రీదండ్లగడ్డ ప్రసన్న వీరాంజనేయ–మల్లికార్జునస్వామి దేవాలయ ఆవరణలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ పిల్లలకు భోజన ప్యాకెట్లు, బిక్షాటన చేస్తున్న యాచకులకు దుస్తులను వారు పంపిణీ చేశారు. పేదలకు తమ వంతు సేవ చేసేందుకు ఎల్లప్పుడూ సహాయం అందిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ మండల రైతుబంధుసమితి సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, కొంతం నర్సింహ్మారెడ్డి, బద్దం కృష్ణారెడ్డి, తళ్లం కోటేశ్వరరావు, కొంతం ఓంకార్‌రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

## జిల్లాలోని నాలుగు మండలాల ఎంపిఓల బదిలీలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా పరిధిలోని నాలుగు మండలాల ఎంపిఓలను బదిలీ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే సోమవారం సాయంత్రం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌కు వివిధ మండలాల ఎంపిఓలు కలెక్టరేట్‌లోని డిపిఓ కార్యాలయంకు విచ్చేసి బదిలీ ఉత్తర్వులను వారు తీసుకున్నట్లు తెలిసింది. అయితే మేడ్చల్ మండల పరిషత్ అధికారి (ఎంపిఓ) వినూత్నరెడ్డి కీసర ఎంపిఓగా బదిలీ అయ్యారు. కీసర ఎంపిఓ మంగ తాయారు మూడుచింతలపల్లి మండల ఎంపిఓగా బదిలీ అయ్యారు. మూడుచింతలపల్లి ఎంపిఓ బి.రవి శామీర్‌పేట మండల ఎంపిఓగా బదిలీ అయ్యారు. శామీర్‌పేట ఎంపిఓ సునిత మేడ్చల్ మండల ఎంపిఓగా బదిలీ అయ్యారు. జిల్లాలోని నాలుగు మండలాల ఎంపిఓల బదిలీలు సాదారణమేనని పలువురు పేర్కొంటున్నారు. అయితే కొందరు ఎంపిఓలను బదిలీ చేయాలని గతంలో కొన్ని మండలాల్లో ప్రజాప్రతినిధులు కోరటంతోనే కొందరు ఎంపిఓల వల్ల మరి కొందరికి బదిలీ పరిస్థితి ఏర్పడినట్లు సమాచారం. వీరు ఒకటి, రెండు రోజుల్లో ఆయా మండలాల్లో ఎంపిఓలు బదిలీ కావటంతో ఇక నూతన ఎంపిఓలుగా ఆయా మండలాల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎంపిఓల బదిలీలు జిల్లాలోని ప్రజాప్రతినిధుల్లో చర్చనీయాంశంగ మారింది.

## కత్తితో దాడిచేసిన ఇద్దరు వ్యక్తుల అరెస్టు

**పూడూరు, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :**

కారును ఓవర్‌టేక్ చేశాడన్న కోపంతో ఓ యువకుడిపై కత్తితో దాడిచేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపిన సంఘటన సోమవారం పూడూరు మండలంలో చోటు చేసుకుంది.చెన్‌గోముల్ ఇంచార్జీ ఎస్ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం హైద్రాబాద్‌లోని అత్తాపూర్‌కు చెందిన అబ్దుల్ సమీ అనే స్టూడెంట్ రంజాన్ పండుగ సందర్భంగా ఈ నెల 7వతేదీన పేదవారికి బట్టలు పంచి తన కారులో ఇంటికి బయలుదేరాడు.అదే సమయంలో పూడూరు మండలం పరిధిలోని మన్నెగూడ గ్రామానికి చెందిన ఎండి సలీం (25),ఎండి తాజ్ (29) అనేవ్యక్తులు తమ వర్ణకారులో వికారాబాద్ వైపునుండి మన్నెగూడకు వస్తుండగా మార్గమధ్యలో ఉన్న ఆదర్శ పాఠశాల సమీపంలో వీరి కారును అబ్దుల్ సమీ ఓవర్‌టేక్ చేశాడు.ఈ విషయాన్ని గమనించిన సలీం,తాజ్‌లు తమ కారును ఓవర్‌టేక్ చేస్తాడా అన్న కోపంతో మన్నెగూడ విస్డమ్ పాఠశాల సమీపంలోకి రాగానే అబ్దుల్ సమీ కారుకు అడ్డుగా పెట్టి కత్తితో దాడి చేశారు.ఈనెల 8వ తేదీన బాదితు డు అబ్దుల్ సమీ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సోమవారం ఎండి సలీం (25),ఎండి తాజ్ (29) లను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

# దేవరయాంజాల్ ప్రభుత్వ భూమిలో అక్రమంగా గుడిసెల ఏర్పాటు

**-కలెక్టరేట్‌లో డిఆర్ఓకు, జిల్లాలా ఆఫీసర్‌కు ఫిర్యాదు**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10,ప్రభాతవార్త**

జిల్లా పరిధిలోని దేవరయాంజాల్ గ్రామంలోని ప్రభుత్వ భూమి సర్వేనెంబరు 709గల భూమిలో స్థానికేతరులు అక్రమంగా గుడిసెలు వేస్తున్నారని, కబ్జాలు చేయిస్తూ కొంత మంది దళారులు అక్రమాలకు పాల్పడుతున్నారని, స్థానికులకు ఇళ్లస్థలాలు దక్కేలా చూడాలని మేడ్చల్ జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్‌కు, జిల్లా లా ఆఫీసర్ చంద్రావతిలకు దేవరయాంజాల్‌కు చెందిన పలువురు ఫిర్యాదు చేసి వినతిపత్రాలను అందజేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌కు శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని దేవరయాంజాల్ గ్రామ ప్రజలు జిల్లా కలెక్టరేట్‌కు విచ్చేసి ప్రభుత్వ భూమిలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని, దళారులపై తగు చర్యలు తీసుకోవాలని వారిని కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగ గ్రామానికి చెందిన పలువురు పేర్కొంటూ సర్వేనెంబరు 709లోగల ప్రభుత్వ భూమిలో కొంత మంది దళారులు జిఓ 58,59కింద ఇళ్ల ఇప్పిస్తామని చెప్పి లక్షల రూపాయలు అధికారుల పేర్లు చెప్పి వసూల్ చేస్తున్నారని, గుడిసెలు వేయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్, మంత్రి మల్లారెడ్డిలు ప్రభుత్వం నుంచి పేద ప్రజలకు ఉచితంగ ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్నామని పేర్కొంటూ ఉండగ స్థానికేతరులు, ఇతర జిల్లాల నుంచి వరంగల్, మహబూబ్‌నగర్, ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారికి ఆ భూమిలో ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని కొందరు గుడిసెలు వేయించి కొందరు లక్షల రూపాయలు దండుకుంటున్నారని విమర్శించారు. దేవరయాంజాల్‌లోని నిరుపేదలు, వికలాంగులు, వితంతులు ఇళ్లు లేక ఒకే ఇంట్లో నలుగురు ఉంటూ అదీచాలక అద్దె ఇళ్లలో ఉంటూ అద్దెలు చెల్లించలేక అవస్థలు పడుతున్నామని, పలు సార్లు మండల తహసీల్దార్‌కు వివరించామని,స్థానికులకు దేవరయాంజాల్ గ్రామ ప్రజలకు అర్హులైన వారికి ఇళ్లస్థలాలు ఇవ్వాలని డిఆర్ఓను, జిల్లా లా ఆఫీసర్‌ను కలిసి కోరారు.



జిల్లాలోని దేవరయాంజాల్‌లో ప్రభుత్వ భూమిలో అక్రమంగ గుడిసెల ఏర్పాటును అరికట్టాలని జిల్లా లా ఆఫీసర్‌కు ఫిర్యాదు చేసిన దేవరయాంజాల్ గ్రామస్థుల దృశ్యం

# దేవరయాంజాల్ వీర హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు



దేవరయాంజాల్‌లోని వీరహనుమాన్ దేవాలయంలో పూజల తరువాత ఆలయ అభివృద్ధికి కృషి చేసిన గ్రామ మాజీ సర్పంచు పీసరి శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించిన నాయకులు

**శామీర్‌పేట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

దేవరయాంజాల్‌లోని వీర హనుమాన్ దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని దేవరయాంజాల్‌లోని వీర హనుమాన్ దేవాలయం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన సేవలు అమోఘమని పలువురు నాయకులు అభినందించారు. దీనిలో ఆలయ అభివృద్ధికి కృషి చేసిన గ్రామ మాజీ సర్పంచు పీసరి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవరయాంజాల్ మాజీ సర్పంచుగా, అల్వాల్ సొసైటీ మాజీ చైర్మన్‌గా, శామీర్‌పేట ఉమ్మడి మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షులుగా పీసరి శ్రీనివాస్‌రెడ్డి పనిచేసి ప్రజల్లో, రైతుల్లో నిలిచి అభివృద్దిలో, సంక్షేమ పథకాల అమలులో ఎంతో కృషి చేశారని,ఆలయాల అభివృద్ధికి, పాఠశాలల అభివృద్ధికి తన వంతు చేయూత నందించారని, అదే విధంగ వీరహనుమాన్ దేవాలయ పునరుద్ధరణ అభివృద్ధి పనులు చేశారని పలువురు ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని ఆలయంలో పూజలు నిర్వహించి పీసరి శ్రీనివాస్‌రెడ్డి సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపాల్టీ కాంగ్రెస్ అధ్యక్షులు భీమిడి జైపాల్‌రెడ్డి, తూంకుంట మున్సిపాల్టీ బిజెపి అధ్యక్షులు పి.నర్సింహ్మారెడ్డి, రామాలయం మాజీ ధర్మకర్త పట్నం నర్సింహ్మారెడ్డి, మాజీ వార్డుసభ్యులు ఎం.శ్యామ్, గ్రామ రెడ్డిసంఘం అధ్యక్షులు కె.శశిధర్‌రెడ్డి, రెడ్డి సంఘం ఉపాధ్యక్షులు పి.రామచంద్రారెడ్డి, పూజారి సీతారామాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే క్యాంపాఫీస్ ముట్టడి..నేతల అరెస్ట్

**-పేపర్ లీకేజీలపై యూత్ కాంగ్రెస్ నిరసన**

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:**

టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీల వ్యవహారంలో అధికారపార్టీ ఎమ్మెల్యేలు అలసత్వం ప్రదర్శిస్తున్నారని యువజన కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ అధ్యక్షులు కొత్త శుశాంత్‌గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్ ఓఆర్ఆర్ జంక్షన్‌లోని మేడ్చల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సోమవారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముట్టడించారు. గ్రూప్–1, ఎస్ఎస్‌సీ పరీక్షా పత్రాల లీకేజీపై ప్రభుత్వ వైఖరిని నిరశిస్తూ తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనారెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు మేడ్చల్ అధ్యక్షులు శుశాంత్‌గౌడ్ నాయకత్వంలో క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించి గేటు మందు ధర్నా చేశారు. దీంతో ఘట్‌కేసర్ పోలీసులు చేరుకొని ఆందోళన చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకొని ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పేపర్ లీకేజీలపై బీఆర్ఎస్ సర్కారు నిర్లక్ష్యధోరణి అవలంబిస్తుండటంతో నిరుద్యోగ యువతకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బద్దం రుక్వర్ధన్‌రెడ్డి, ఘట్‌కేసర్ మున్సిపల్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, దమ్మాయిగూడ అధ్యక్షులు సుమేష్, జవహార్‌నగర్ అధ్యక్షులు వినయ్, పోచారం అధ్యక్షులు యుగేందర్, మేడ్చల్ మండల అధ్యక్షులు వెంకటేశ్, బోడుప్పల్ నాయకులు బీరప్ప, నాయకులు సాయిరాంరెడ్డి, మహేశ్, సాయిచరణ్, సాయికుమార్,సాయి.కృష్ణ, శ్రావణ్‌నాయక్, గణేశ్‌నాయక్, మధు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లోని మేడ్చల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

## పేదలకు 'కంటివెలుగు' ఒక వరం

**నంగునూర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** కంటి వెలుగు కార్యక్రమం పేదలకు ఒక వరమని ఎఎంసి చైర్మన్ రాగుల సారయ్య, మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అప్పలయచెరువు గ్రామంలో ఏర్పాటుచేసిన కంటివెలుగు శిబిరాన్ని పిఎసిఎస్ చైర్మన్ మహిపాల్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకవాలనా న్నరు. మంత్రి హరీష్‌రావు వైద్య రంగానికి పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గట్టు మల్లవ్వ,ఉప సర్పంచ్, నాయకులు గట్టు శ్రీనివాస్, వివోఏ అనురాధ, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పది పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా విద్యాధికారి

**పెద్దశంకరంపేట, ఏప్రిల్10 ప్రభాతవార్త:** పదవ తరగతి పరీక్షా కేంద్రాలైన ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల కేంద్రాలను జిల్లా విద్యాధికారి రాధాకిషన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పరీక్షా కేంద్రం బయట విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగానే జరుగుతున్నాయని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షా కేంద్రాల్లో అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరిండెంట్‌లు సుజాత, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## రామకోటి రామరాజుకు భద్రాచలం దేవస్థానం నుంచి పిలుపు

**గజ్వేల్, ఏప్రిల్ 10 (ప్రభాతవార్త):** భద్రాచలం దేవస్థానం ఏఈఓ నుండి పిలుపు వచ్చినట్లు రామకోటి భక్తసమాజం అధ్యక్షుడు రామకోటి రామరాజు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ గత రెండు నెలల క్రితం కోటి తలంబ్రాల దీక్ష కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించి భద్రాచలం దేవస్థానానికి తలంబ్రాలను అందివ్వడం వల్ల భద్రాచలం ఏఓ అభినందించి పిలువడం జరిగిందన్నారు. సీతారాముల కళ్యాణం అనంతరం తలంబ్రాలను రామకోటి సంస్థకు ఇవ్వనున్నట్లు భద్రాచలం దేవస్థాన ఏఈఓ శ్రావణ్‌కుమార్ తెలిపారని రామరాజు పేర్కొన్నారు. తలంబ్రాలు తీసుకురావడానికి సోమవారం భద్రాచలం వెళ్తున్నట్లు తెలిపారు. తలంబ్రాలను తీసుకువచ్చి కోటి తలంబ్రాల దీక్షలో పాల్గొన్న వేలాది మంది భక్తులకు అందిస్తానని తెలిపారు.

## పోచమ్మ దేవాలయ పునర్ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

**కోహేడ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కూరెళ్ల గ్రామంలో నిర్మాణంలో ఉన్న పోచమ్మ దేవాలయం పునర్ నిర్మాణం, త్వరలో నిర్వహించబోయే అమ్మవార విగ్రహ ప్రతిష్ట, శ్రీలక్ష్మీ భూలక్ష్మీ బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవానికి గ్రామ మాల సంఘం సోమవారం రూ. లక్ష పదహారు వేలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీలక్ష్మీ భూలక్ష్మీ బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి గ్రామ మాల సంఘం లక్ష 16 విరాళంగా అందించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు ఎలాంటి విఘ్నాలు, అటంకాలు కలగకుండా ప్రతి పనిలో జయం కలగాలని గ్రామం సుభిక్షగా ఉండాలని త్వరలో బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మార్గం తిరుపతి, గాజుల రవీందర్, ఈగ మల్లయ్య, ఇట్టవేని రేణుక కొమురయ్య, చిట్యాల లక్ష్మీశంకర్, బండారి నరేష్, మాల సంఘం ప్రతినిధులు పంగ అంజయ్య, పంగ మల్లికార్జున్,రాకం రాజయ్య, గద్దల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి ర్యాలీని విజయవంతం చేయాలి

గజ్వేల్, ఏప్రిల్ 10 (ప్రభాతవార్త): ఈనెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రజ్ఞాపూర్‌లో భారీ ర్యాలీ నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు అంబేద్కర్ సంఘం నాయకులు పేర్కొన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం ప్రజ్ఞాపూర్‌లోని 3వ వార్డు కౌన్సిలర్ మర్కంటి వరలక్ష్మికనకయ్య ఏర్పాటుచేసిన లక్ష్మి ఫౌండేషన్ తరపున రూ.5వేలు తనవంతు విరాళం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మహనీయుల జయంతి ఉత్సవాలను జరుపుకోవడం అభినందనీయమన్నారు. అంబేద్కర్ గొప్ప మహనీయుడని, ప్రతి ఒక్కరూ అంబేద్కర్ అడుగుజాడలో నడవాలని సూచించారు. ప్రజ్ఞాపూర్‌లో నిర్వహించే ర్యాలీని వార్డు ప్రజలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## గోనె మైసమ్మ జాతర పత్రిక ఆవిష్కరణ

**వెల్దుర్తి ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని దేవతల చెరువు వద్ద వెలసిన మహిషాసుర మర్ధినిగా పేరుగాంచిన గోనె మైసమ్మ జాతర ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించడానికి ఉత్సవ కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఈ సందర్భంగా సోమవారం గోనె మైసమ్మ ఆలయం వద్ద జాతర ఉత్సవాల పత్రికను ఆవిష్కరించారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ జాతరను అత్యంత వైభవోపేతంగా వారం రోజుల పాటు గ్రామంలో జరపడం జరుగుతుంది. జాతరకు పరిసర ప్రాంత ప్రజలే కాకుండా హైదరాబాద్ తదితర ప్రాంతాల నుండి తరలి వస్తారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ ఆముద ఆంజనేయులు, కృష్ణాగౌడ్, నర్సింలు, వెంకటేశం, శేఖాగౌడ్, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ అశోక్‌గౌడ్, నాయకులు శ్రావణ్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

**వెల్దుర్తి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** లోక కళ్యాణార్థం ప్రతి ఒక్కరూ భక్తి భావం అలవర్చుకున్నట్లయితే ఎంతో మంచి జరుగుతుందని అర్చకులు దత్తు పంతులు అన్నారు. సోమవారం వెల్దుర్తిలోని కోమటిపల్లిలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత వెంకటేశ్వరస్వామి దేవాలయంలో వైశ్యుల ఆధ్వర్యంలో 51వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే పుణ్యాహవచనం, రుత్వికవనం, పంచామృతాలతో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అభిజిత్ లగ్న ముహూర్తాన శ్రీదేవి, భూదేవి సహిత వెంకటేశ్వరులకు కళ్యాణ తంతు నిర్వహించారు. కోమటిపల్లిలోని ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్య వైశ్య సంఘం మండల మాజీ అధ్యక్షులు కొమిరిశెట్టి రమేష్‌గుప్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి ఒడి బియ్యాలు సమర్పించి, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణంలో భక్తులతో కిటకిటలాడింది.

## సిఎం కెసిఆర్‌తోనే గజ్వేల్ అభివృద్ధి : కౌన్సిలర్

**గజ్వేల్, ఏప్రిల్ 10 (ప్రభాతవార్త):** సిఎం కెసిఆర్ సారధ్యంలోనే గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందిందని 12వ వార్డు కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం 12వ వార్డులో సిసి రోడ్డు నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ శరవేగంగా అభివృద్ధి చెందిందన్నారు. సిసి రోడ్లను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. అండర్ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయని, త్వరలో ప్రతి వీధిలో సిసి రోడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ వార్డు అధ్యక్షుడు జమీల్, ముఖ్య సలహాదారు నాగేందర్, ఎర్ర మల్లేశం, హన్మంతు, కొల్లూరు స్వామి, గులాం, పాషా, నాగరాజు, మల్లేశం, చందు, బిక్షపతి, సంతోష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

**తొగుట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెద్దమాసాన్‌పల్లికి చెందిన వెల్దండి లక్ష్మీ మృతి బాధాకరమని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి అన్నారు. సోమవారం బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. కారయ క్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ కంది రాంరెడ్డి, సర్పంచ్,ఎంపిటిసిలు మెట్టు వరలక్ష్మీ స్వామి, మాష్టి సుమలత కనకయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు బోయిని శ్రీనివాస్, నాయకులు పన్యాల ఎల్లారెడ్డి, కొల కనకయ్య, తాళ్ల నర్సింలు, కనకయ్య తదితరులు ఉన్నారు.

## పట్టణంలో వేగంగా అభివృద్ధిని సాధిస్తుంది

చేవెళ్ల ఏప్రిల్10,ప్రభాతవార్త : వేగంగా అభివృద్ధి చెందుతున్న దుస్తులు మరియు ఉపకరణాల స్పెషాలిటీ గొలుసు రిలయన్స్ రిటైల్స్,ట్రెండ్స్ రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి పట్టణంలో తన కొత్త స్టోర్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ట్రెండ్‌లు దేశంలో ఫ్యాషన్‌ను నిజంగా ప్రజాస్వామ్యం చేస్తున్నాయి. శంకర్‌పల్లిలోని ట్రెండ్స్ స్టోర్ ఆధునిక రూపాన్ని మరియువాతావరణాన్ని కలిగి ఉంది ఇది ఈ ప్రాంతంలోని వినియోగదారులకు సంబంధించిన అద్భుతమైన నాణ్యమన ఫ్యాషన్ వస్తువులను అదించనుంది.



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు వెన్న రాజు

## ఆత్మగౌరవ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

**-మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వెన్న రాజు**

హుస్నాబాద్, ఏప్రిల్ 10,ప్రభాతవార్త : జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో ఈనెల 12న నిర్వహించనున్న మాల,మాల ఉపకులాల ఆత్మగౌరవ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు వెన్న రాజు పిలుపునిచ్చారు.సోమవారం రోజున హుస్నాబాద్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్యతో కలసి సమ్మేళనం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నిర్వహించే సభలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్, ప్రజానౌక గద్దర్‌లు ముఖ్య అతిధులుగా హాజరవుతారన్నారు.తమ హక్కులు,డిమాండ్ల సాధన కోసం మాల,మాల ఉపకులాల నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**రాయపోల్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** మండల పరిధిలోని తిమ్మక్కపల్లి గ్రామానికి చెందిన బిజెపి యువమోర్చా ప్రధాన కార్యదర్శి కుమ్మరి ప్రవీణ్ తాత కుమ్మరి బాగులు ఇటీవల మృతి చెందాడు. దుబ్బాక ఎమ్మెల్యే మాదవనేని రఘునందన్‌రావు ఆదేశాలమేరకు బిజెపి మండల అధ్యక్షులు మాదాసు వెంకట్‌గౌడ్ వారి కుటుంబాన్ని పరామర్శించి 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసారు. కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు మధు, మండల ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి లింగం, బూత్ అధ్యక్షులు స్వామి, బాలయ్య,నాయకులు మహేందర్‌రెడ్డి, వంశీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## సిఎం సహాయనిధి పేదలకు వరం

**-సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ప్రవీణ్**

**మర్కుక్, ఏప్రిల్ 10 (ప్రభాతవార్త):** ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంలాంటిదని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ప్రవీణ్ అన్నారు. మండల పరిధిలోని వర్థరాజ్‌పూర్ గ్రామానికి చెందిన యాట మహేష్, బి.శ్రీకాంత్, బి.కృష్ణలు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు సహకారంతో మంజూరైన చెక్కులను సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా యాట మహేష్‌కు రూ.లక్షా 20వేలు, బి.శ్రీకాంత్‌కు రూ.90వేలు, బి.కృష్ణకు రూ.లక్ష చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బి.అశోక్, నల్ల నగేష్‌లు పాల్గొన్నారు.

## చౌటపల్లి గ్రామాన్ని హుస్నాబాద్‌లో విలీనం చేయండి

**అక్కన్నపేట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** మండలంలోని చౌటపల్లి గ్రామాన్ని హుస్నాబాద్ మండలంలో చేర్చాలని సర్పంచ్ గద్దల రమేష్ అన్నారు. సోమవారం అక్కన్నపేట తహశీల్దార్ సంజీవ్‌కుమార్ వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 59 జీవో ద్వార అక్కన్నపేట మండలంలోని కొన్ని గ్రామాలు హుస్నాబాద్‌లో విలీనమయ్యాయని గుర్తు చేశారు.తమ గ్రామ నుండి అక్కన్నపేట మండల కేంద్రానికి కనీసం ట్రాన్స్‌పోర్టు కూడా సరిగ్గా ఉండదని అక్కన్నపేట కంటే తమకు హుస్నాబాద్ సమీపంగా ఉండడంతో పాటు రవాణా సౌకర్యం మెరుగ్గా ఉంటుందన్నారు.గ్రామ ప్రజల కోరిక మేరకు తమను హుస్నాబాద్ మండలంలో విలీనం చేయాలన్నారు.

## 'కంటివెలుగు'ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**-మండల పరిషత్ అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ**

**శివ్వంపేట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** కంటివెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీల ఫోరం మెదక్ జిల్లా అధ్యక్షుడు, శివ్వంపేట ఎంపిపి కల్లూరి హరికృష్ణ అన్నారు. సోమవారం ఉసిరికపల్లి గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, సర్పంచి బాబురావు, ఎంపీటీసీ సభ్యులు మర్రి సత్తిరెడ్డి, బీసీ సెల్ మండల పార్టీ అధ్యక్షులు జి.శ్రీనివాస్‌గౌడ్, ఉప సర్పంచి మర్రి నరేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కంటివెలుగు శిబిరానికి హాజరయ్యే ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ ప్రియాంక, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాయిని వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ కార్మిక విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి సిల్వేరి విరేశం, నాయకులు కృష్ణారావు, భిక్షపతిగౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తాటికొండ రాజశేఖర్‌గౌడ్, పానగారి వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## మరింత శక్తివంతంగా పని చేస్తుంది

శామీర్‌పేట ఏప్రిల్10,ప్రభాతవార్త : కస్టమర్స్ అనుభవం మరియు భద్రతను పెంచడానికి తమ నిరంతర ప్రయత్నాలలో భాగంగా,అమేజాన్ పే భారత్ బిల్ పే సహకారంతో తమ లోన్ చెల్లింపు శ్రేణిని మరింత శక్తివంతం చేసింది.లోన్ చెల్లింపు శ్రేణి అనేది విద్యుచ్ఛక్తి మరియు మున్సిపల్ పన్ను వంటి ఇతర ఆప్షన్స్‌లో బిల్లు చెల్లింపులో ప్రముఖ శ్రేణిలలో ఒకటిగా ఉంది. ఈ శ్రేణి బ్యాంక్స్,మైక్రో ఫైనాన్స్ సంస్థలు,ఎన్‌బీఎఫ్ సీలు ద్వారా తమ లోన్స్‌ను పొంది మరియు తమ ఈఎంఐలను సకాలంలో చెల్లించడానికి సౌకర్యవంతమైన చెల్లింపు ఎంపిక అవసరమైన కస్టమర్స్ కోసం లోన్ చెల్లింపు ఆప్షన్‌ను సమన్వయం చేస్తుంది.

## బాధిత కుటుంబానికి జడ్‌పిటిసి ఆర్థిక సహాయం

శివ్వంపేట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: ఏ గ్రామంలోనైనా ఆపద వచ్చినవారు అధైర్యపడవద్దని, అందుబాటులో ఉంటూ ఆర్థిక సహాయ సహకారాలు అందజేస్తానని జిల్లా పరిషత్ ప్రణాళిక సంఘం సభ్యులు,జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త అన్నారు. సోమవారం మండల పరిధలోని చెన్నాపూర్ గ్రామానికి చెందిన గ్రామ పంచాయితీ 3వ వార్డు సభ్యులు ఆకుల భిక్షపతి మృతిచెందిన విషయం తెలుసుకున్న మహేష్‌గుప్త సోమవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5 వేలు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చెన్నాపూర్ సర్పంచి బోళ్ల భారతి భిక్షపతి, పారిశుద్ధ్య కమిటీ చైర్మన్ బోళ్ల ఆంజనేయులు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు రామచంద్రంగౌడ్, నాయకులు యుద్ధంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గొల్ల మల్లేష్, హనుమంత్‌రెడ్డి, యాదగిరి, ఆకు కొమురయ్య, ఆకు మల్లేశం, ఆకు రాములు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

పటాన్‌చెరు. ఏప్రిల్10 ప్రభాతవార్త: పటాన్‌చెరు మండలంలోని ముత్తంగి గ్రామ పరిధిలోని రామరాజు నగర్‌లో నివాసముంటున్న యువ నాయకులు అబ్దుల్ ఆబెద్ సామాజిక సేవ కార్యక్రమాలలో భాగంగా రంజాన్ మాసం పర్వదినం పురస్కరించుకొని 300 మంది నిరుపేదలకు, వికలాంగులకు, గ్రామ పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసరాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యువ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, గ్రామ సర్పంచి ఉపేందర్‌లు హాజరై అబ్దుల్ ఆబెద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆబెద్ గత కొన్ని సంవత్సరాలుగా మతాలకు అతీతంగా అన్ని పండుగలకు కుల మతాలు తేడా లేకుండా నిరుపేదలకు, వికలాంగులకు తనకు తోచిన విధంగా తన వంతు సహాయం చేస్తున్నారని, ఆ సేవలు అభినందనీయమని అన్నారు. భగవంతుడు వారిని, వారి కుటుంబాన్ని సుఖ:సంతోషాలతో ఉంచాలని కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీనివాస్, అబ్దుల్ ఖాదర్, మేరాజ్ ఖాన్, నిజాం ఖాన్, సోయాల్ ఖాన్, అబ్దుల్ సలీం, అబ్దుల్ ఖాదర్, రామకృష్ణ పాల్గొన్నారు.

## ఎస్‌బిఎం గ్రామీణ శిక్షణ నిర్వహణ

**కొల్చారం, ఏప్రిల్10 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఎస్‌బీఎం గ్రామీణ ఫేజ్–2 శిక్షణను ఏపీవో మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో గణేష్‌రెడ్డి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, ఎంపీవో కృష్ణవేణి, ఏపీఎం సుశ్మీల, సీసీ వెంకటేశం, ఏఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ఐకేపీ, ఐసీడీఎస్, సిబ్బంది, టీవోటీలు మహిపాల్ రెడ్డి, ప్రకాష్, ఎండి. ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న నాయకులు

**కీసర ఏప్రిల్10,ప్రభాతవార్త :** సిఎం సహాయనిధి పథకం నిరుపేదలకు వరంగా మారిందని పలువురు బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.సోమవారం కీసర గ్రామానికి చెందిన ముద్దం మల్లేష్ యాదవ్‌కి సిఎం సహాయనిధి నుండి మంజూరైన 42వేల 500ల చెక్కును బీఆర్ఎస్ నాయకులు అందజేశారు.ఈ సందర్భంగా ఆపదలో ఉన్న ప్రతినిరుపేద కుటుంబ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కీసర మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్ రెడ్డి,గ్రామశాఖ అధ్యక్షుడు చినింగని బాల్ రాజ్,ప్రధాన కార్యదర్శి రాగుల గణేష్,ఉపాధ్యక్షుడు సుమన్ బన్నీ, యువత అధ్యక్షుడు మెట్టు పరమేష్ యాదవ్,రెడ్డబోయేన మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## బలగం సినిమా సహాయ నటుడు సహదేవుకు సన్మానం



నటుడు సహదేవును సన్మానిస్తున్న సురేష్

**శంషాబాద్ ఏప్రిల్10,ప్రభాతవార్త :** బలగం సినిమా సహాయ నటుడు శంషాబాద్ ప్రాంతానికి చెందిన ప్రముఖ నటుడు పోతుగంటి సహదేవ్‌ను ఎస్‌విజీ డెవలపర్స్ గ్రూప్ సోమవారం ఘనంగా సన్మానించింది.ఎస్‌విజి గ్రూపు ఎండి ఈగ గిరిబాబు ముదిరాజ్,బీఆర్ఎస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ,డైరెక్టర్ రాచమల్ల సురేష్ తమ సంస్థ కార్యాలయంలో సహదేవును శాలువా పూలమాలతో సన్మానించి నగదును అందజేశారు.ఈ సందర్భంగా రాచమల్ల సురేష్ ఈగ గిరిబాబు మాట్లాడుతూ...విశేష ప్రజాదరణ పొందిన బలగం సినిమాలో తమ ప్రాంతానికి చెందిన సహదేవుకు ఎంతో ప్రాధాన్యత కలిగిన పాత్ర లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.దాదాపు 20 సంవత్సరాలుగా ఆర్టిస్టుగా పనిచేస్తున్న సహదేవుకు బలగం సినిమాతో మంచి గుర్తింపు లభించిందని ఆయన మరిన్ని సినిమాల్లో పాత్రలకు జీవం పోయాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.ఆయన ద్వారా శంషాబాద్ ప్రాంతానికి మరింత మంచిపేరు రావాలని కోరుకుంటున్నానని తెలిపారు.సినీ నటుడు సహదేవ్ మాట్లాడుతూ..ప్రముఖ నిర్మాత దిల్‌రాజ్ తమ ప్రతిభను గుర్తించి మంచి అవకాశం కల్పించాలని దానిని సద్వినియోగం చేసుకోవడం వల్ల ప్రజలలో తగిన గుర్తింపు లభిస్తున్నదని పేర్కొన్నారు.రెండు దశాబ్దాలుగా సినిమా ఫీల్డ్‌లో ఉన్న తనకు దిల్‌రాజ్ కొత్త జీవితాన్ని ప్రసాదించాలని తెలిపారు. మంచి చిత్రాలను ప్రజలు ఆదరిస్తారని బలగం విజయం ఆ సినిమాకు గ్రామ గ్రామన లభిస్తున్న ఆదరణ నిదర్శనమని పేర్కొన్నారు.

## ముస్లింలకు ఇఫ్తారు విందు

**-నిత్యవసర వస్తువులను అందజేసిన మాజీ జడ్పిటిసి వైస్ చైర్మన్**



ముస్లీం సొదరులకు నిత్యవసర సరుకులు అందజేస్తున్న మాజీ జడ్పివైస్ చైర్మన్ నవీన్ రెడ్డి

**నందిగామ ఏప్రిల్10,ప్రభాతవార్త :** నందిగామ మండలం మొదళ్లగూడ గ్రామపంచాయతీ పరిధిలోని మజిద్ మామిడిపల్లి గ్రామంలో ముస్లింసోదరులకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ జడ్పివైస్ చైర్మన్ ఎన్.నవీన్ కుమార్ రెడ్డి ఇఫ్తారు విందుతో పాటు ,నిత్యవసర సరుకులను అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉమ ప్రవీణ్ రెడ్డి,ఎంపిటిసి కాట్న మాధవి రవీందర్,ఉప సర్పంచ్ షఫీ సోసియా,వార్డు మెంబర్లు శ్రీను,అబ్బాస్, రాజు,భాగమ్మ, సునీత, యాదమ్మ,శ్రీరాం కో ఆప్షన్ సభ్యుడు ఆంజనేయులు గౌడ్,అనిత,మామిడిపల్లి ఉప సర్పంచ్ హన్మంత్ రెడ్డి,మాజీ ఉప సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, మామిడిపల్లి వార్డు సభ్యులు వెంకటేశ్వర్ రెడ్డి,రఘుపతి రెడ్డి,ప్రభు, సింగిల్ విండో డైరెక్టర్ యాదగిరి రెడ్డి,ముస్లీం మతపెద్దలు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వహించవద్దు



పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**కద్తాల్,ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** పట్టణంలో సోమవారం గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి శ్రీశైలం జాతీయ రహదారిపై ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ గూడూరు లక్ష్మినరసింహారెడ్డి ఈ సందర్భంగా ఆయన రోడ్లపై ఉన్న దుకాణాల సముదాయాలను, చిరు వ్యాపారులు రోడ్లపై చెత్త వేయరాదని సూచించారు. అదేవిధంగా పారిశుద్ధ్య నిర్వహణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలియజేశారు. బహిరంగ ప్రదేశాల్లో నిబంధనలకు విరుద్ధంగా చెత్త వేసినచో పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం జరిమాన విధించనున్నట్లు తెలిపారు. చెత్తను గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య ట్రాక్టర్‌లో మాత్రమే వేసి గ్రామాభివృద్ధికి తోడ్పడా లని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, కార్యదర్శి జగన్, యువ నాయకులు అంజి, రాజశేఖర్, కారోబార్ సాయిబాబా పాల్గొన్నారు.

## అందరికి కోసం కంటి వెలుగు : సుష్మమహేందర్ రెడ్డి

**శంషాబాద్ ఏప్రిల్10,ప్రభాతవార్త :** కంటి వెలుగు పథకాన్ని అందరి సంక్షేమం కోసం ప్రవేశపెట్టినట్లు శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కొలను సుష్మామహేందర్ రెడ్డి తెలిపారు.మున్సిపల్ పరిధిలోని 5వ.వార్డులో సోమవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ భోగేశ్వరులు స్థానిక కౌన్సిలర్ మసరత్ జాన్ తాజ్ బాబాతో కలిసి ఆమె ప్రారంభించారు.శిబిరానికి హాజరైన బస్తీవాసులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం మారుమూల ప్రాంతాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న కంటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడం కోసం వాడవాడలో క్యాంపులను ఏర్పాటు చేస్తున్నదని అన్నారు.ఈ క్యాంపులలో కంటి సమస్యలు ఉన్నవారు పరీక్షలు నిర్వహించుకొని సమస్యలను దూరం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ దివ్య ,స్థానిక నాయకులు పాల్గొన్నారు.



కంటి వెలుగను ప్రారంభిస్తున్న సుష్మమహేందర్ రెడ్డి

# గడపగడపకి సిపిఐ వాల్ పోస్టర్ విడుదల

**-బిజెపి హటావో, దేశ్‌కు బచ్చావో అనే నినాదంతో ముందుకువెళ్తాం**

**-రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు ఎం. ప్రభులింగం**

**మొయినాబాద్, ఏప్రీల్ 10, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఏప్రిల్ 14 నుండి మే 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 119 నియోజకవర్గాల్లో గడపగడపకి సిపిఐ పార్టీ అనే కార్యాక్రమాన్ని చేపట్టింది, దేశంలోని కేంద్రంలో ఉన్న బిజేపి హటావో, దేశ్‌కు బచ్చావో అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రజలపై, నిత్యవసర ధరలను పెంచి దేశపరిపాలనను, సామాన్యుని జీవితాన్ని అందకారంలోకి నేట్టివేసిందని, బిజేపి నిరంకుష పాలనను ఎండగట్టడానికి రాష్ట్రంలో గడపగడపకు సిపిఐ పార్టీ అనే నినాదంతో ప్రజలవద్దకు వెళ్తున్నామన్నారు, ఈ సందర్బంగా దానికి సంబంధించిన గోడ పోస్టర్‌ను మొయినాబాద్ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు ఎం. ప్రభులింగం చేతులమీదుగా, మండల సిపిఐ మండల కార్యాదర్శి కె. శ్రీనివాస్ ఆధ్వర్యంలో గోడ పోస్టర్‌ను విడుదల విడుదల చేశారు, ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడి పేద ప్రజల పై చేస్తున్న నిరంకుష పాలనను ఎండగట్టడానికి ఈ కార్యాక్రమానికి పూనుకున్నామని అన్నారు, ప్రజలవద్దకు వెల్లి బిజేపి, నరేంద్రమోడి విధానాల వలన, దేశంలో వివిధ రంగాల్లో జరుగుతున్న అన్యాయాలను దేశ సమైక్యత, సమగ్రతకు వాటిల్లే ప్రమాదాలను ప్రజలకు వివంచడమే కాకుండా భవిష్యత్‌లో ఇంకా ఎంత నిరంకుష పాలనను చేస్తారో తెలియజేస్తామన్నారు, బిజేపి ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్టు, నిరంకుష హిట్లర్ తరహా పాలనను అందిస్తున్న నరేంద్రమోడిని, బిజేపి పార్టీని వచ్చే 2024 ఎన్నికల్లో ఓడించి వామపక్ష ప్రగతిశీల, లౌకిక ప్రజాస్వామ్య శక్తులతో కూడిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చేవిధంగా ప్రజలను చైతన్యపరిచి పాదయాత్రలను ప్రజీ పోరు యాత్రలను వివిధ రూపాల్లో చేపట్టి ప్రతి గ్రామము సందర్శిస్తామని సిపిఐ జాతీయ సమితి పలిలుపుమేరకు, అందరు కార్యకర్తలు కూడ సంసిద్ధం కావాలని ఆయన అన్నారు, ఈ కార్యాక్రమానికి మద్దతుగా సిపిఐ పార్టీ మాత్రవమే కాకుండా అన్ని రకాల కార్మికవర్గం రైతులు కర్షకులు, అధిక సంఖ్యలో పాల్గోని ఇంటింటికి వేళ్తున్న సిపిఐ పార్టీ కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు, ఈ కార్యాక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్ గౌడ్, జిల్లా ఉపాధ్యాక్షుడు బి. సుభాష్ రెడ్డి, ఏఐటియూసి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, మండల సహయ కార్యాదర్శి జంగయ్య, చేవేళ్ల మండల కార్యాదర్శి ఎండి, మక్బుల్, బి.కె.ఎమ్ జిల్లా అధ్యక్షుడు జే. అంజయ్య, ఆర్ సత్తయ్య గౌడ్, పి. శ్యాంసుందర్, కె. నరేందర్, ఎం, వెంకటయ్య, ఎండి జలీల్ ఒగ్గు సత్యనారాయణ, చేవెళ్ల మండల మహిళ అద్యక్షురాలు, మంజుల, మాదవి, విజయమ్మ, సాయిలమ్మ తధితరులు పాల్గోన్నారు.



# నిరుద్యోగుల కోసం కలిసి పోరాడదాం...

**- వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఇంఛార్జీ ఎం.డి.ఇబ్రహీం**

**- రెండు రోజుల పాటు అధికారులకు వినతిపత్రాలు అందజేత కార్యక్రమాలు**

**షాద్‌నగర్, ఏప్రిల్ 10, (ప్రభాతవార్త) :** రాష్ట్రంలో నిరుద్యోగులు తీవ్ర అన్యాయం అవుతున్నారని, వారికి అండగా పార్టీలకు అతీతంగా అందరం కలిసి పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని వైఎస్సార్ టీపీ పార్టీ నియోకవర్గ ఇంఛార్జీ ఎం.డి. ఇబ్రహీం పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ఎంతో మంది నిరుద్యోగులు రోడ్డున పడుతున్నారని ఆయన మండి పడ్డారు. నిరుద్యోగులకు అండగా నిలబడాటానికి పార్టీలకు అతీతరంగా నాయకులు, సంఘాల నాయకులు టీ-సేవ్‌లో భాగం కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జరుగుతున్న పేపర్ లీకేజీల ద్వార నిరుద్యోగుల భవిష్యత్తు ఆగమ్యగోచరంగా తయారైందని, ఎప్పుడు ఏ పేపర్ లీక్ అవుతుందో తేలియని పరిస్థితి నెలకొందని అన్నారు. బిస్వాల్ కమిటీ ప్రకారం రాష్ట్రంలో 1.91 వేల పోస్టులు ఖాలీలు ఉండగా కేవలం 80వేల పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయన్న ముఖ్యమంత్రి కేసీఆర్ వాటి సహితం సరిగ్గా భర్తీ చేయాలేకపోతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. అటూ కేంద్ర ప్రభుత్వం ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు అని ప్రగాల్భాలు పలికి నేటి వరకు వాటిపై స్పష్టత ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. అదే విధంగా పేద విద్యార్థులపై భారం పడకుండా తక్షణమే పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లను అందజేలన్నారు. నిరుద్యోగ యువత పడుతున్న వేదన చూడలేకనే వైస్సార్ టీపీ పార్టీ అధినేత్రి వైఎస్ శర్మిలమ్మ టి-సేవ్ అనే ఫారాన్ని స్థాపించిందని, దీని ముఖ్యఉద్దేశం అన్ని పార్టీల నాయకులను, సంఘాలను కలుపుకొని వెళ్లి నిరుద్యోగులకు న్యాయం జరిగేలా పోరాటాలు చేయడమేనని ఆయన స్పష్టం చేశారు. అందులో భాగంగానే నేడు, రేపు రెండు రోజుల పాటు జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో, మండలాల్లో అధికారులకు వినతి పత్రాలు సమర్పించే కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పని సరిగా హాజరై విజయవంతం చేయాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్సార్ టీపా పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎం.డి.ఇబ్రహీం.

# కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తట్టెపల్లిని మండల కేంద్రంగా చేస్తాం

**-రిలే నిరహార దీక్షకు సంఘీభావం ప్రకటించిన కాంగ్రెస్ నాయకులు**

**-టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యాక్షులు రమేష్ మహరాజ్**

**పెద్దేముల్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే తట్టెపల్లిని మండల కేంద్రంగా చేస్తామని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యాక్షులు యం.రమేష్ మహరాజ్ అన్నారు. పెద్దేముల్ మండలంలోని తట్టెపల్లి చౌరాస్తాలో రిలే నిరహార దీక్ష చేపట్టిన మండల సాధన సమితి సభ్యులకు సోమవారం యం.రమేష్ మహరాజ్, జడ్‌పిటిసి ధారాసింగ్ తదితరులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ తట్టెపల్లి ప్రాంతం చాల వెనుకబడిన ప్రాంతమని, విద్యకు, వైద్యంకు దూరంగా ఉండటంతో ఇక్కడి ప్రజలు ఎంతో అవస్థలు పడుతున్నారని అన్నారు. కర్ణాటక బార్డర్‌లో ఉన్నందున తట్టెపల్లి అభివృద్ధికి నోచుకోవడంలేదని అన్నారు. ఇక్కడి ప్రజలు పెద్దేముల్ మండలానికి వెళ్ళడానికి ఎన్నో వ్యయప్రయాసాలు ఓనర్చవలసి వస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. గిరిజనులు అత్యధికంగా ఉండే ఈ ప్రాంతంలో తట్టెపల్లిని మండల కేంద్రంగా చేయవలసిన అవసరం ఎంతైన ఉందని అన్నారు. తట్టెపల్లిని మండల కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించేవరకు మండల సాధన సమితి సభ్యులకు తమ పూర్తి సహకారాన్ని అందిస్తామని భరోసా కల్పించారు. అన్ని విధాలుగా అర్హతలున్న తట్టెపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కాంగ్రెస్‌పార్టీ తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అవసరమైతే కాంగ్రెస్ అధిష్టానంతో మాట్లాడి తట్టెపల్లిని మండల కేంద్రంగా చేసేందుకు అసెంబ్లిలో ప్రస్తావన తెచ్చేందుకు తమవంతు కృషిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీన్‌కుమార్ గుప్తా, యంపిటిసి శంకర్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు గోపాల్, సీనియర్ నాయకులు నారాయన్‌గౌడ్, ప్రభుకుమార్, మాజీ సర్పంచ్‌లు మల్లప్ప,శివరాం,బాబుసింగ్, గెమ్యానాయక్, సంగమేష్, జగన్, రతన్, నసీర్, సాబెర్, ఖయ్యుం తదితరులు పాల్గొన్నారు.





దీక్షకు సంఘీబావం పలుకుతున్న యం.రమేష్, ధారాసింగ్

## విగ్రహ ప్రతిష్టాపనకు అనువైన స్థలం ఎంచుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఎంఐఎం పార్టీ నాయకులు

**కొడంగల్,ఏప్రిల్ 10ప్రభాతవార్త** కొడంగల్ పట్టణ కేంద్రంలోని వినాయక్ చౌరస్తాలో ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్టాపనకు అనుకూలమైన స్థలం కాదని ఎంఐఎం తాలూకా అధ్యక్షులు ఎస్బీ. గుల్షన్ అన్నారు.సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతు అసలే ఇరుకుగా ఉన్న వినాయక కూడలిలో ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్టపనకు స్థానిక ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కల్సి భూమిపూజ చేశారన్నారు.వినాయక కూడలిలో రోడ్డు ఇరుకుగా ఉన్నందున ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు ప్రతినిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.విగ్రహప్రతిష్టాపన భూమిపూజ రోజున పట్టణవాసులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటే బాగుండేదని అభిప్రా యం వ్యక్తం చేశారు.ఇరుకైన రోడ్డులో విగ్రహ ప్రతిష్టాపన చేయడం వల్ల వాహ నదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని,విగ్రహ ప్రతిష్టాపనకు తాము వ్యతిరేకం కాదని,వినాయక చౌరస్తా మీదుగా ముస్లీం స్మశాన వాటికకు వెళ్ళే మార్గం కావడంతో పాటు ఈద్గాకు వెళ్ళేందుకు ఇబ్బందులు ఏర్పడుతాయ న్నారు.అలాగే వినాయక చవితి ఉత్సవాల్లో అక్కడ వినాయకుడి విగ్రహ ఏర్పాటుతో ఎవరైనా ముస్లీం సోదరులు చనిపోయిన సమయాల్లో అంత్యక్రియల కోసం స్మశాన వాటికకు తీసుకెళ్తున్న సమయంలో ఇబ్బందులు తప్పడం లేదన్నా రు.వినాయక చౌరస్తాలో విగ్రహ ప్రతిష్టాపన విషయంలో గతంలో సీఐ.ఎస్సైల అద్వర్యంలో పట్టణంలోని పెద్దలతో మాట్లాడిన తర్వాతనే నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని అన్నారు.విగ్రహ ఏర్పాటు స్థలంపై పునరాలోచించాలని అన్నారు.సమావేశంలో పార్టీ నాయకులు సయ్యద్ ముస్తఫా,షేక్ రుమాన్,ఎండీ. ముర్తుజా,షేక్ అజార్,ఎండీ.రజాక్,ఎండీ.సర్తజ్ తదితరులు పాల్గొన్నారు.

## శంకర్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో సీపీఆర్ శిక్షణ తరగతులు



సీపీఆర్ శిక్షణ తరగతులపై అవగాహన కల్పిస్తున్న జిల్లా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

**శంకర్‌పల్లి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** శంకర్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిలో సోమవారం సీపీఆర్ శిక్షణ తరగతులు జరిగాయి. ఈకార్యక్రమానికి జిల్లా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ దామోదర్ హాజరయ్యారు. ఈసందర భంగా ఆయన మాట్లాడుతూ.... శిక్షణ తీసుకున్న అభ్యర్థులు రోగులకు మరిన్ని సేవలు అందించాలన్నారు. ఈకార్యక్రమంలో శంకర్‌పల్లి పీహెచ్‌సీ డాక్టర్ రేవతిరెడ్డి, టంగటూర్ పీహెచ్‌సీ డాక్టర్ సత్యజ్యోతి, సీహెచ్‌వో గోపాల్‌రెడ్డి, హెచ్‌ఈవో సుదర్శన్‌రెడ్డి, సీపీఆర్ శిక్షకులు డాక్టర్ ప్రసాద్, ఆసుపత్రి సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, ల్యాబ్ టెక్నిషియన్లు సీపీఆర్ ట్రైనీలు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులను సన్మానించిన కలెక్టర్ నారాయణ రెడ్డి



**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** మోమిన్ పేట మండలం,చీమలదరి గ్రామ పంచాయతీకి 2021-2022 సంవత్సరమునకు జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డుకు ఎంపికైనందుకు జిల్లా కలెక్టర్ గ్రామ అధికారులు,ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు.సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో వికారాబాద్ శాసన సభ్యులు డా.మెతుకు ఆనంద్,జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మలతో కలిసి గ్రామ సర్పంచ్ నాసన్ పల్లి నరసింహారెడ్డి గ్రామ కార్యదర్శి తంగడపల్లి సుగుణకు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వికారాబాద్ జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం చాలా సంతోషించదగ్గ విషయం అన్నారు.మునుముందు కూడా అధికారులు ఇంకా పూర్తి బాధ్యతతో కష్టపడి పనిచేసి జిల్లాకు గుర్తింపు తేవాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా అధికారులైన డిఆర్‌డిఓ కృష్ణన్,డిపిఓ తరుణ్ కుమార్,డివిజన్ పంచాయతీ అధికారులు అనిత,శంకర్ నాయక్,మోమిన్ పేట ఎంపిడివో శైలజ,గ్రామ ప్రజాప్రతినిధులను కలెక్టర్ సన్మానించారు.

## ప్రజలకు చేరువగా కంటి వెలుగు

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్ 10,(ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతీష్టాత్మకంగ చేపట్టిన కంటి వెలుగు గ్రామీణ స్థాయి ప్రజలకు ఎంతో చేరువగ ఉంటుందని చేగిరెడ్డి ఘనాపూర్ సర్పంచ్ శివమౌళి అన్నారు. సోమవారం గ్రామంలో రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విడుదల చేస్తున్న ప్రతి పథకం ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. కంటి వెలుగు వల్లన గ్రామంలోని ఎంతో పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని, నాణ్యమైన కళ్ల అద్దాలను ప్రభుత్వం అందజెస్తుందని ఆయన పెర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి అమ్రమ్మ, ఉప సర్పంచ్ రాములు, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష, మంగమ్మ, ఖాజ, శ్రీనివాస్,బాల్‌రాజు, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్ శివమౌళికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

# ఆ ఇద్దరూ మా వాళ్లే ...

**-కాంగ్రెస్ కంచుకోటను ఎవరూ ఢీకొనలేరు**

**-కాంగ్రెస్ పార్టీ ఖాళీ అనడం హాస్యాస్పదం**



నందిగామలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**నందిగామ ఏప్రిల్10,ప్రభాతవార్త :** నందిగామ ప్రజల ఆశీర్వాదం ఉన్నంతకాలం కాంగ్రెస్ పార్టీ కంచుకోటగానే ఉంటుందని ,కాంగ్రెస్ ఖాళీ అయిందని బీఆర్ఎస్ నాయకులు చెప్పుకోవడం హాస్యస్పదంగా ఉందని పలువురు కాంగ్రెస్ నేతలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెష్ మండల అధ్యక్షుడు జంగనర్సింలు ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు.ఆదివారం జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరే ఇద్దరు చించోటి కృష్ణ గౌడ్,టైలర్ కృష్ణలు మాత్రమే బీఆర్ఎస్ పార్టీలో చేరితే 200మంది కాంగ్రెస్ నాయకులు చేరారని అనడం ఆవాస్తవమాన్నారు.కాంగ్రెస్ నాయకులను భయం బ్రాంతులకు గురిచేసి పోలీసుల చేత కేసులు పెట్టించడం అలవాటుగా మారిందని ఎవరేన్ని కుట్రలు చేసిన రాబోయే రోజుల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు.ఈ విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ ఎంపిటీసీలు కొమ్ము కృష్ణ, చంద్రాపాల్ రెడ్డి,దేపల్లె కుమార్ స్వామిగౌడ్,సింగిల్ విండో వైస్ చైర్మన్ జంగ రజినీకాంత్ యాదవ్,డైరెక్టర్ రామస్వామి గౌడ్,జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ బోమ్మగళ్ల నర్సింహా,కాంగ్రెస్ నాయకులు తడకల జంగయ్య, సప్పిడి మహేష్,చెన్నగల్ల యాదగిరి,బోమ్మగల్ల రవి,తదితరులున్నారు.

## విజవంతమైన వైద్య శిబిరం



**తలకొండపల్లి ఏప్రిల్10,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని చుక్కపూర్ గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.శిబిరానికి ఎంపిపి నిర్మల శ్రీశైలం గౌడ్ హాజరై స్థానిక సర్పంచ్ కిష్టమ్మ,ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి,స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు.చుక్కాపూర్ గ్రామస్తులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.శిబిరంలో వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.ఈ సందర్భంగా ఎంపిపి నిర్మల శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ....ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ తలకొండపల్లి జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ నిరుపేదలకు సేవలు అందించాలనే లక్ష్యంతో నియోజకవర్గంలోని అన్ని మండలాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.ఇప్పటికే ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదల కోసం వేయికి పైగా ఇళ్ల నిర్మాణాలను చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు.పేద విద్యార్థుల చదువు కోసం సహాయ సహకారాలు అందిస్తూ వందల సంఖ్యలో విద్యార్థులను ట్రస్ట్ ఆధ్వర్యంలో చదివిస్తున్నట్లు తెలిపారు.ఈ శిబిరాలను అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైద్యులు దివ్యం,అక్షయ, సంతోష్, మనిషా,నాయకులు మాజీ ఎంపిటిసి యాదయ్య,రంగారెడ్డి,తాలూకా గౌడ సంఘం కన్వీనర్ అశోక్ గౌడ్,కుమార్ వెంకటయ్య, రాఘవేందర్, శేఖర్ రెడ్డి,లింగయ్య,మల్లేష్,చంద్రశేఖర్,బిక్కు గౌడ్,నాగిళ్ల జగన్,శేఖర్, మధు,రాకేష్,వెంకటేష్,నరసింహ,తదితరులు ఉన్నారు.

**ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎల్లమ్మ గుడి స్లాబ్ పనులు**

మండలంలోని రాంపూర్ పరిధిలోని సంగాయిపల్లి గ్రామంలో ఎల్లమ గుడి స్లాబ్‌ను ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో వేయించారు.ఈ పనులను ఎంపిపి తిరుమణి నిర్మల శ్రీశైలం గౌడ్ పరిశీలించి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఉదయ శంకర్,అంతారం తిరుపతయ్య, ఆలయ కమిటీ సభ్యులు పబ్బ రామయ్య,పబ్బ చంద్రయ్య,తాడు వెంకటయ్య,పబ్బ వెంకటయ్య,నరసింహ,దరువుల సాయిలు ,యువ నాయకులు సంపత్,రమేష్,ఆరికట్ల శ్రీకాంత్,తాడెం అజయ్,అశోక్,పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

**-పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్**



అంతారం గ్రామ పంచాయతీ సర్పంచ్ సులోచనకు అంబేద్కర్ చిత్రపటంను అందజేస్తున్న పిడిఎస్‌యు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్

**చేవెళ్ల ఏప్రిల్ 10,ప్రభాతవార్త** ఏప్రిల్ 14న ప్రపంచ మేధావి,భారతరత్న,మహనీయుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలని పిడిఎస్‌యు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ అన్నారు. సోమవారం అంతారం గ్రామ పంచాయతీకి అంబేద్కర్ చిత్రపటంను అందజేశారు.ఈ సందర్భంగా పిడిఎస్‌యు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ మాట్టాడుతూ దళిత జాతీ విద్యార్దులకు ఉమ్మడి కళాశాలల స్దాపన ఉపకార వేతనాల మంజూరు,ఉన్నత విద్యాభ్యాసానికి విదేశి చదువులకు సహయం చేయడం దళిత జాతులను పోలీసు, మిలిటరీ సర్వీసుల్లోకి తీసుకోవడం వంటి వాటిని ముందుగా భారత రాజ్యాగంలో వారి హక్కులను రాసిని గోప్ప మహనీయుడిని స్మరించుకోవాలన్నారు. దళితులకు విముక్తిని కల్పించిన అయన అడుగుజాడల్లో నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంతారం సర్పంచ్ సులోచన, కెప్టెన్ అంజన్‌గౌడ్, ఉప సర్పంచ్ అనసూయ, పిడిఎస్‌యు చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు కొజ్జంకి జైపాల్, కార్యదర్శి బోజ్జ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు సురేష్, అశోక్, శివ ప్రసాద్, అంబేద్కర్ యువ జన సంఘం సభ్యుడు మెడికొండ మహేష్ తదితరులు పాల్గోన్నారు.

## మరకత శివాలయంలో ప్రత్యేక పూజలు

**శంకర్‌పల్లి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** శంకర్‌పల్లి మండలంలోని చందిప్ప గ్రామంలో ఉన్న మహిమాన్వితమైన మరకత శివాలయంలో సోమవారం సందర్భంగా పెద్ద ఎత్తున్న భక్తులు లింగానికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

